



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 636 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర శనివారం 10 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం


# పిఠాపురంలో రూల్స్ కచ్చితంగా అమలు కావాలి

- ఏ అంశంలో అయినా రూల్ బుక్కు మాత్రమే మాట్లాడాలి
- అధికారుల విధి నిర్వహణలో ఎలాంటి జోక్యాలు ఉండవు
- పాలన వ్యవహారాల్లో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి
- 'మోడల్ పిఠాపురం' మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి
- పిఠాపురం అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి దిక్సూచి కావాలి
- పిఠాపురంలో క్షత్ర స్థాయి పర్యటన అనంతరం అధికారులతో సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్





పిఠాపురం, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, జనవరి 09: పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎన్నికల సమయంలో ప్రజలకు మాటిచ్చాను. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. నిర్ణీత వ్యవధిలో అందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పిఠాపురాన్ని స్వచ్ఛ, సుందర పిఠాపురంగా మార్చాలి.. నిధులకు కొరత రాకుండా తాను చూసుకుంటాను అన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అధికారులు చూసుకోవాలన్నారు. అధికారుల విధి నిర్వహణలో ఎవరి జోక్యం ఉండదు.. అధికారులను ఎవరూ ఇబ్బందిపెట్టరు.. పాలనా వ్యవహారాల్లో రాజకీయ ప్రమేయం అసలు ఉండదని చెప్పారు. ప్రతి అడుగులో తాను జవాబుదారీతనంతో ఉంటాను. పరిపాలనా వ్యవహారాల్లో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పిఠాపురం నియోజకవర్గం కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న మోహన్ నగర్, ఇందిరా నగర్ ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అపరిశుభ్రత, డ్రెయిన్లు, కాలువలపై ఆక్రమణలు చూసి.. పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు

# పిఠాపురం ప్రజల మధ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- సంక్రాంతి సంబరాల ప్రారంభోత్సవం అనంతరం పట్టణంలో క్షత్ర స్థాయి పర్యటన
- పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి
- ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ ముందుకు సాగిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్





పిఠాపురం, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, జనవరి 09 : తన నియోజకవర్గం ప్రజలని కలుసుకునేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పట్టణంలో క్షత్ర స్థాయి పర్యటన చేపట్టారు. పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలను ప్రారంభించిన అనంతరం పట్టణంలో కాలినడకన ప్రజల వద్దకు వెళ్లి, వారితో ముచ్చటిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పిఠాపురం ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి**

ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానం నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెలుపలికి రాగానే పలువురు ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు నిల్చుని ఉన్నారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వాహన శ్రేణి నుంచి దిగిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అక్కడి నుంచి శ్రీ కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయం వరకు ప్రజల్ని పలుకరిస్తూ కాలినడకన ముందుకు సాగారు. పెద్దింటి అనంత పద్మావతి అనే మహిళ తమకు ఇంటి స్థలం కావాలని కోరారు. మరో మహిళ తమ ఇళ్ల వద్ద విద్యుత్ తీగలు సాగిపోయి కిందికి వచ్చేసి ప్రమాదకరంగా ఉన్నాయని, సాగిపోయిన విద్యుత్ తీగలు తగిలి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్న విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



# కృష్ణాజిల్లా వాసికి శ్రీకృష్ణదేవరాయ జాతీయ పురస్కారం

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, జనవరి 09 : సాహిత్య అభివృద్ధిలో భాగంగా తెలుగు భాషను కాపాడుకోవడం కోసం అనేక రచనలు చేస్తూ వివిధ రకాల వార్తా పత్రికల్లో తన రచనలు ముద్రించబడటమే కాకుండా, ఇప్పటికే మూడు పుస్తకాలు రచించి, కవితా సమీక్షలు చేస్తూ సాహిత్య అభిలాషతో, సాహిత్యం పై పట్టు సంపాదించి తనకంటూ సాహిత్య రంగంలో గుర్తింపు తెచ్చుకున్నందుకు గాను, విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ 11వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో 9 జనవరి 2026న జరిగిన కార్యక్రమంలో యువ కవయిత్రి పోలగాని భానుతేజశ్రీకి శ్రీ కృష్ణదేవరాయ, శ్రీ పొట్టి శ్రీరాములు కళాసేవారత్న పురస్కారం మరియు కళాపోషక పురస్కార ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పురస్కారంతో మరింత బాధ్యత పెరుగుతుందని, ప్రస్తుతం మరియు భవిష్యత్తులో తెలుగు భాష కోసం, సాహితీ రంగ అభివృద్ధి కోసం పాటుపడతానని, యువతను చైతన్య పదం వైపు నడిపే విధంగా, సామాజిక స్థితిగతులపై అవగాహన కల్పించే విధంగా తన రచనలు ఉంటాయని యువ కవయిత్రి భాను శ్రీ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రముఖులు అభినందించారు.



# సమాజ నిర్మాణంలో "పత్రికల పాత్ర కీలకం"

- నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి
- ఆజాద్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన సీపీ

విశాఖపట్నం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 09 : మెరుగైన సమాజ నిర్మాణంలో వార్తా పత్రికల పాత్ర ఎంతైనా ఉందని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి మీడియా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విశాఖ కేంద్రంగా వెలువడుతూ విశేష పాఠక అభిమానం సంపాదించుకున్న ఆజాద్ దినపత్రిక 2026 వార్షిక క్యాలెండర్ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. నగర పోలీస్ కమిషనరేట్ లోని కమీషనర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. విశాఖ న్యూస్ పేపర్ పబ్లిషర్ సొసైటీ కార్యదర్శి, ఆజాద్ దినపత్రిక ఎడిటర్ పితాని సూర్యప్రసాద్ తొలుత సంక్రాంతి శుభ సందర్భంగా పోలీస్ కమిషనర్ ను ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనర్ కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆజాద్ నూతన సంవత్సరం క్యాలెండర్ ను కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆజాద్ క్యాలెండర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశాఖ న్యూస్ పేపర్ పబ్లిషర్స్ సొసైటీ (విఎన్ఎస్) ట్రెజరర్ కొయిలాడ పరుశు రామ్, ఇతర పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

# పీఠికాపురాన ముందస్తు సంక్రాంతి కాంతులు




2




# కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే


3





# పిఠాపురంలో రూల్స్ కచ్చితంగా అమలు కావాలి





. అనంతరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి జిల్లా ఇంచార్జి కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వం కలిగిన పర్యాటక ప్రదేశం. మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల నుంచి ఇక్కడ శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి దర్శనానికి భక్తులు వస్తారు. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒక్కటైన పురూహుతికా అమ్మవారి దర్శనానికీ నిత్యం భక్తులు వస్తూనే ఉంటారు. నియోజకవర్గంలో అడుగుపెట్టిన వారికి పచ్చని చెట్లతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం స్వాగతం పలకాలి. పిఠాపురం వచ్చిన వారికి ప్రత్యేకమైన అనుభూతి కలగాలి. ముందుగా ప్రధాన రహదారిని అందంగా ముస్తాబు చేయాలి. అందుకు అవసరం అయిన ప్రణాళికలు యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలి. ఇక్కడ జరిగే అభివృద్ధి అన్ని నియోజకవర్గాలకు దిక్సూచి కావాలన్నారు.

**- ప్రతీ నెలా ప్రగతి నివేదిక కావాలి**

పిఠాపురంలో డ్రెయిన్లు తెరిచి ఉన్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా లేవని యానాదుల కాలనీవాసుల నుంచి ఫిర్యాదు వచ్చింది. డ్రెయినేజీ వ్యవస్థ ఇబ్బందిగా ఉందని ప్రజలు చెబుతున్నారు. డ్రెయిన్లు, పంట కాలువల్లో తక్షణం పూడిక తీత పనులు చేపట్టండి. నియోజకవర్గ పరిధిలో ఎక్కడా చెత్త కనబడకూడదు. అందుకోసం తక్షణ ప్రణాళికలు అమలు చేయాలి. నియోజకవర్గం మొత్తం అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ లు అవసరం ఉంది. సీవేజ్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి అనువైన ప్రదేశాలు గుర్తించండి. పట్టణంలో ప్రధాన రహదారికి డివైడింగ్ లైన్లు వేయండి. అవసరమైతే మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ప్రయివేటు కన్సల్టెన్సీల సాయం తీసుకోండి. జనాభా ప్రతిపదికన నియోజకవర్గానికి ఎన్ని పార్కులు అవసరం, వాటిని ఏర్పాటు చేయడానికి అనువైన ప్రదేశాలు గుర్తించి ఒక నివేదిక రూపొందించండి. నియోజకవర్గ అభివృద్ధిలో నెలవారి ప్రగతి స్పష్టంగా కనబడాలి. కోనో కార్పస్ చెట్ల స్థానంలో స్వదేశీ జాతి చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఖాళీ ప్రదేశాల్లో సామాజిక వనాలను అభివృద్ధి చేయండి. మియావకీ ప్లాంటేషన్ పై ప్రజల్లో అవగాహన కల్పించండి. మోహన్ నగర్, రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన సమస్య ఉంది. దీని మూలంగా అనారోగ్య సమస్యలు వస్తాయి. అవసరం అయితే సామూహిక మరుగుదొడ్లు నిర్మించి, ప్రజలకు అవగాహన కల్పించండి.

**- పిఠాపురం నుంచి మార్పు మొదలుకావాలి**

బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటు వ్యవహారంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయండి. ధ్వని కాలుష్యంపై దృష్టి సారించండి. మతపరమైన వేడుకలు నిర్వహించుకునే సమయంలో కూడా నిబంధనల మేరకే సౌండ్ పెట్టేలా చూడాలి. అన్ని మతాలకీ ఒకటే రూల్ అమలు చేయాలి. లా అండ్ ఆర్డర్ అమలు వ్యవహారంలో రాజీ పడవద్దు. పిఠాపురంలో ప్రతి అధికారి రూల్స్ మాత్రమే ఫాలో అవ్వాలి. ఎవరు ఏం అడిగినా రూల్స్ బుక్ మాత్రమే మాట్లాడాలి. పిఠాపురం నుంచే ఆ మార్పు ప్రారంభం కావాలి అన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పిఠాపురం ప్రజల మధ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పిఠాపురం పోలీస్ స్టేషన్ పరిశీలన

అనంతరం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు. స్టేషన్లో ఉన్న గదులను చూసి పిఠాపురంలో శాంతి భద్రతల తీరుపై ఆరా తీశారు. స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఫొటోలు దిగారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చి కుక్కుటేశ్వరస్వామి ఆలయ సమీపంలో యానాదుల కాలనీవాసులను పలుకరించారు. దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి యానాదుల కాలనీలో పక్కా ఇళ్లు నిర్మించాలని, డ్రయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు చెప్పుకున్నారు. శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం వెలుపల ఉన్న దుకాణదారులను పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. చివరిగా ఆలయ అర్చకులతో మాట్లాడి వారితో ఫొటోలు దిగారు.

– పిఠాపురంలో అభివృద్ధి పండుగొ రూ.211 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

పిఠాపురం నియోజకవర్గానికి సంక్రాంతితో పాటు అభివృద్ధి పండుగను తీసుకువచ్చారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. పీఠికాపుర సంక్రాంతి మహోత్సవంలో పాల్గొన్న ఆయన రూ.211 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పిఠాపురం మండల పరిధిలో రూ.9.60 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, కోనపాపపేటలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫిషరీస్ సెంటర్, ఉపాధి హామీ పథకం, ఆర్ అండ్ బి నిధులు, సాస్కీ నిధులతో నిర్మించనున్న రోడ్లు, గోకులాలు, వివిధ అభివృద్ధి పనులు ఉన్నాయి

# పీఠికాపురాన ముందస్తు సంక్రాంతి కాంతులు

**- మూడు రోజుల వేడుకలకు శ్రీకారం చుట్టిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్-అచ్చ తెలుగు సంస్కృతిని ఆవిష్కరించిన సంక్రాంతి సంబరాలు**

**-ఆకట్టుకున్న జానపద కళారూపాలు, శాస్త్రీయ నృత్యరీతులు- డప్పు శబ్దాలు, కొమ్ముకోయల ఆటలు.. గరగ నృత్యాలు, వీరనాట్య రీతులు, కోలాటాల సందళ్ల మధ్య సంబరం**

**- గోపూజలు చేసి, హరిదాసుల కీర్తనలు ఆస్వాదించిన పవన్ కళ్యాణ్ -సీమంతం, భోగి పళ్ల మహోత్సవాల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**














పిఠాపురం, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాంద్ర, జనవరి 09 : పీఠికాపురాన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రతి అడుగు తెలుగింటి సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడగా.. పల్లె పదాలు, ప్రగతి వీచికలు అన్ని ఒకే వేదికపై ఆవిష్కృతం కాగా... డప్పుల శబ్దాల సందళ్లు, పల్లె పడుచుల కోలాటాల కోలాహలం మధ్య స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సహచర మంత్రులతో కలిసి పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం పేరిట ఏర్పాటు చేసిన ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. సంప్రదాయబద్దంగా గో ఆరాధన చేసి, రంగవల్లులు తీర్చిదిద్దిన హరివిల్లుల ముంగిట ప్రకృతికి పూజలు నిర్వహించారు. తెలుగు సంస్కృతికి అద్దం పట్టే జానపదుల గీతికలు, శాస్త్రీయ నృత్యాలను ఆహుతులతో కలిసి ఆస్వాదించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ ను ప్రారంభించి మన హస్తకళల శైలిని పరిశీలించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ, పర్యాటక శాఖ మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పవన్ కళ్యాణ్ తో కలసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. పిఠాపురానికి సంక్రాంతిని ముందుగానే తెచ్చిన ఈ సంబరాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.

హరిదాసు సంకీర్తనలు, మేళతాళాల మధ్య ఆటలాడే బసవన్నలు, గుండెలపై ధరించిన డప్పుల శబ్దాలతో చిందులేసే తప్పెటగుళ్ల కళాకారుల విన్యాసాలు, లయబద్ధంగా సాగే గరగ నృత్యాలు, శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు, చిన్నారుల భవితను కాంక్షించే భోగిపళ్ల మహోత్సవాలు, ప్రకృతికి జీవాన్నిచ్చే గోమాతల పూజలు, హస్త కళల సోయగాల మధ్య అచ్చ తెలుగు పండుగ సంక్రాంతికి పిఠాపురం నుంచి స్వాగతం పలికారు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. శుక్రవారం ఉదయం గం. 10.30 నిమిషాలకు పిఠాపురంకి చేరుకున్న పవన్ కళ్యాణ్ కి శాస్త్రీయ కూచిపూడి నృత్యకళాకారులు సంప్రదాయబద్దంగా స్వాగతం పలికారు.

**థింసా కళాకారులతో పదం కలిపిన పవన్ కళ్యాణ్**

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన కళారూపాలు తిలకిస్తూ పవన్ కళ్యాణ్ ముందుకు కదిలారు. ఆ కళా రూపాలు ఉప ముఖ్యమంత్రిని విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్లెపడుచుల కోలాటాలు, వీర నాట్యాలు, గిరిజన సంప్రదాయాలకు అద్దం పట్టే కొమ్ము కోయల సందళ్లు అడుగడుగునా స్వాగతం పలుకగా పవన్ కళ్యాణ్ కళాకారులతో మమేకమవుతూ.. ఆసక్తిగా తిలకిస్తూ కళాకారులను పేరు పేరునా పలుకరిస్తూ.. వారితో ఫొటోలు దిగుతూ ముందుకు సాగారు. ప్రతి సంప్రదాయం గురించి ఆరా తీస్తూ వారి కళాకారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా కళాకారులతో కలిసి పదం కలిపి నృత్యం చేశారు.

**హరిదాసులకు స్వయంపాక దానం**

సంక్రాంతి మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంటి ముంగిట రంగవల్లుల హరివిల్లులను తిలకిస్తూ, హరిదాసుల సంకీర్తనలు విన్నారు. సంప్రదాయబద్దంగా ధాన్యం, ధనం, కూరగాయలు, పండ్లతో కూడిన స్వయంపాక దానం చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ స్టాల్ ను పరిశీలించారు. వరితోపాటు విభిన్న జాతుల సిరిధాన్యాల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

**రాట్నం వడుకుతూ..**

చేనేత, జౌళి, చేతివృత్తులు, మహిళా, శిశు సంక్షమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పవన్ కళ్యాణ్ సందర్శించారు. చేనేత కళాకారులను పలుకరించి స్వయంగా రాట్నం వడికి, మగ్గాన్ని పరిశీలించారు. జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలను స్టాళ్లను తిలకించారు. ఉప్పాడ చీరలు, కలంకారీ తదితర వస్త్రాల మీద అద్దిన కళలు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. నేతన్నలు ప్రత్యేకంగా రూపొందించిన కోటును ధరించి వారిని ఉత్సాహపరిచారు. తోలు బొమ్మల కళాకారులతో ముచ్చటించారు. లేపాక్ష స్టాల్ లో శ్రీనివాసుని ప్రతిమలను తిలకించారు. అనంతరం గర్భిణి స్త్రీలకు పవన్ కళ్యాణ్ శ్రీమంతం వేడుక నిర్వహించారు. అదే స్టాల్ లో చిన్నారులకు బోగి పళ్లు పోసి చిరాయుష్షు కలగాలని ఆశీర్వదించారు. ఏటికొప్పాక లక్క బొమ్మలు, బొబ్బిలి వీణలను పరిశీలించారు. వీణతో తంత్రిని మీటి సంగీత ధ్వనులను ఆస్వాదించారు. రాష్ట్రంలో పర్యాటక కేంద్రాలు, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఏర్పాటు చేసిన పర్యాటక శాఖ స్టాల్ ను సందర్శించారు. శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరి గంగులయ్య, పిఠాపురం మాజీ శాసన సభ్యుడు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జ్ కృష్ణంరాజు, ఏఎంసీ ఛైర్మన్ వాకపల్లి దేవి సూర్య ప్రకాష్, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిలా ఎస్పీ బిందు మాధవ్, నటులు హైపర్ ఆది, ఆర్.కె.సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉజ్వల, దీపం -2 పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగు

**- రావులపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఉజ్వల పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 09 : ఉజ్వల, దీపం 2 పథకాలతో మహిళల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగు నింపుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం రావులపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఉజ్వల పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఒక్కొక్కరికీ రూ.5వేల విలువైన మొత్తం రూ.10.75లక్షల విలువైన 215 కనెక్షన్స్ మహిళలకు అందజేసారు. దీపం పథకం కింద ఇప్పటికే కొత్తపేట నియోజకవర్గంలో 15,108 సబ్సిడీ సిలిండర్లు కింద రూ.1.33 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. దీపం పథకం, ఉజ్వల పథకం రాయితీల కింద కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి కొత్తపేట నియోజకవర్గంలో రూ.5.66 కోట్లను అందించడం జరిగిందన్నారు. సాధారణ సిలిండర్ కి సైతం రాష్ట్రం రూ.572లు సబ్సిడీ కేంద్రం రూ.310లు సబ్సిడీ కింద అందిస్తున్నాయన్నారు. ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన రాహుల్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కృషిని ప్రశంసించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలతో సంక్షమాన్ని అమలు చేస్తున్నామన్నారు. పింఛన్లను రూ.4వేలకు పెంచడం జరిగిందన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేలను తల్లికి వందనం కింద ఇస్తున్నామన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.14వేలు జమ చేశామన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోనే ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఇప్పటికే రూ.6కోట్లను అందజేశామన్నారు. డ్వాక్రా మహిళలు ఎవరైనా పారిశ్రామిక వేత్తలుగా మారాలనుకుంటే ఎమ్.ఎస్.ఎమ్.ఈ కింద సలహాల కోసం రావులపాలెంలో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతా శ్రీను, గుత్తుల రాంబాబు, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, సాధనల శ్రీను, పెచ్చేటి చిన్నారావు, చిన్నం శ్రీనివాసరెడ్డి, రాచకొండ సతీష్, చింత శ్రీరామరెడ్డి, కోట వెంకటేశ్వరావు, కోట రమణిదుర్గ, కొవ్వూరి అచ్చిరెడ్డి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతి సెలవుల్లో విహార యాత్రలకు, స్వగ్రామాలకు వెళుతున్నారా!..

# పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతరం నిఘా.



## .. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల జిల్లా ఇన్చారి

సంక్రాంతి సెలవుల్లో విహారయాత్రలకు స్వగ్రామాలకు వెళుతున్నారా అయితే పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతరం నిఘా ఉంటుందని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

దొంగలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంది

విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో (లేదా) ఇతర సురక్షతమైన ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలి

పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతర నిఘా

తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఒక్క క్షణం ఏమరపాటు కూడా తీవ్ర విషాదానికి దారితీయవచ్చు

సంక్రాంతి సెలవుల సందర్భంగా తాత్కాలికంగా ఇళ్లకు తాళాలు వేసి విహార యాత్రలు, తీర్థయాత్రలు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్ లో ముందస్తుగా సమాచారం ఇచ్చి వెళ్లాలని జిల్లా ఎస్పీ

బి. ఉమామహేశ్వర్

జిల్లా ప్రజలకు సూచించారు. సంక్రాంతి సెలవులను ఆసరాగా చేసుకొని తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సెలవుల సమయంలో ఇంటికి తాళాలు వేసి వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇంటిపై నిరంతర పోలీసు నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తామని తెలిపారు. సాధారణంగా దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

విహార యాత్రలకు వెళ్లే సమయంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షతమైన ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఇంటిని గమనిస్తూ ఉండాలని పొరుగువారికి ముందుగానే తెలియజేయాలని, ఎప్పటికప్పుడు వారికి ఫోన్ చేసి ఇంటి పరిస్థితి గురించి తెలుసుకుంటూ ఉండాలని తెలిపారు. వీలైనంత వరకు ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని మొబైల్ ఫోన్‌లకు అనుసంధానం చేసి ఫుటేజ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎవరైనా అనుమానాస్పదంగా ఇంటి పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ఇంటి లోపల, బయట రాత్రి వేళల్లో లైట్లు వెలిగించి ఉంచాలని సూచించారు. దాని ద్వారా ఇంట్లో వ్యక్తులు ఉన్నారనే భావన కలిగి దొంగలు దొంగతనాలకు పాల్పడకుండా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంక్రాంతి కాలంలో చోరీలు జరగకుండా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా, సెలవుల సందర్భంగా విహార యాత్రలకు, బంధువుల గ్రామాలకు లేదా ఇతర ప్రదేశాలకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. తెలియని ప్రదేశాల్లో ఉన్న కాలువలు, వాగులు, నదులు, చెరువులు, సముద్ర తీర ప్రాంతాల్లో నీటిలోకి దిగడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా యువత సరదా కోసం పరిచయం లేని ప్రదేశాల్లో ఈతకు వెళితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

పిల్లలు సముద్రాలు, నదులు, కాలువలు వంటి నీటి ప్రదేశాల్లో ఈతకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే, తప్పనిసరిగా సురక్షతమైన ప్రదేశాల్లోనే తల్లిదండ్రులు లేదా పెద్దల సంరక్షణలో వెళ్లే విధంగా చూసుకోవాలని సూచించారు. జలవనరుల వద్దకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఒక్క క్షణం ఏమరపాటు కూడా తీవ్ర విషాదానికి దారితీయవచ్చునని తెలిపారు.

సముద్ర తీర ప్రాంతాలు, నదులు మరియు ప్రజలు ఎక్కువగా ఈతకు వెళ్లే ఇతర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న గృహాల వివరాలను సేకరించి, రాత్రి గస్తీ తిరిగే సిబ్బందికి ఆ సమాచారాన్ని అందజేయాలని సూచించారు. గస్తీ సిబ్బంది సదరు గృహాలను తరచుగా సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రాత్రి గస్తీ సమయంలో పోలీస్ సైరన్ వేసుకుంటూ తిరగాలని, అనుమానాస్పదంగా కనిపించే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసి విచారించాలని తెలిపారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా వారి వేలిముద్రలను స్కాన్ చేయాలని, ఎవరైనా నేరాలకు పాల్పడినట్టు రికార్డుల్లో తేలితే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేయాలని సూచించారు. దీనివల్ల నేరస్తులను సులభంగా గుర్తించి దొంగతనాలను సమర్థవంతంగా నివారించవచ్చునని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు తెలిపారు

# కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగుతుండటంతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగనతలం నుంచి పరిశీలించారు.అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షభ నిర్వహణ బృందం (జమీ) ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది. బావి హెడ్ సమీపంలో సురక్షతంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది.ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.



# పామూరు నూతన ఎస్సై కట్టా అనూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నేతలు

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 09 : పామూరు మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా నియమితులై బాధ్యతలు చేపట్టిన కట్టా అనూక్ ను శుక్రవారం పామూరు మండల బిజెపి బృందం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పామూరు బిజెపి మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను, బిజెపి సీనియర్ నాయకుడు కొండిశెట్టి రమణయ్య, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పెరమన విజయ్ కుమార్ చారి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బయ్య, బిజెపి సీనియర్ నాయకుడు కొప్పరపు సుబ్బారావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సింగరాజు శివకృష్ణ, మండల బిజెపి ఉపాధ్యక్షుడు బొంతల హజరత్, మండల బిజెపి కార్యదర్శి కొత్తూరి గోపాల్, మండల బిజెపి నాయకులు నాగేంద్ర, అరవింద్, పవన్ బిజెపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవ జూనియర్ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 09 : ప్రముఖ పుణ్యక్షత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ సత్యదేవా జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు చాలా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎం.మంజులా దేవి విచ్చేసి సత్యనారాయణ స్వామి వారి చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగా భోగి మంటలు మరియు పిండి వంటలు, అలాగే విద్యార్థులు వేసిన ముగ్గులు పోటీలు, విద్యార్థులచే తప్పెడు గుళ్ళు మరియు తీన్మార్ వంటి అనేక సంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఈ సందర్భంగా కోకో కోలా కంపెనీ ద్వారా తటవర్తి చిన్న విద్యార్థినీ విద్యార్థులకు శీతల పానీయం అందజేశారు. అలాగే ముగ్గులు పోటీల విజేతలకి బహుమతులు ప్రధాన చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకట్ మాట్లాడుతూ సంస్కృతిక కార్యక్రమాలు నేటితరంకి అవగాహన లేకపోవడం జరుగుతుందని, అలాగే మన సంస్కృతి మన సంప్రదాయాలు భారతదేశానికి మూలాలుగా ఉన్నాయన్నారు. మన పండుగలు విద్యార్థుల్లో అవగాహన కావాలని అనేక ఇతర కార్యక్రమాలు విద్యార్థుల దృష్టిలో తెలియజేయడం కోసం ఈ కార్యక్రమం తీసుకొస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ స్వామి,అమ్మవార్లకు రూ.90 వేలు విలువచేసే వస్త్రాలు సమర్పణ



అన్నవరశీ, సింహగర్జన ప్రతినిధి,, జనవరి 09 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని శ్రీ స్వామి, అమ్మవార్లకు జగ్గంపేట వాస్తవ్యులు కందుల వీర వెంకట విజయలక్ష్మ రూ.90 వేలు విలువచేసే చీరలు, పంచులును దేవస్థానం కార్యనిర్వాహనాధికారి వేంద్ర త్రినాథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను త్రినాథరావు అభినదించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దామెర కృష్ణారావు, ఇఇ రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు కోట సుబ్రహ్మణ్యం, సుధీర్ పాల్గొన్నారు.

# వనదుర్గమ్మ వారి ఆలయంలో ఘనంగా చండీ హెూమం

అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 09 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అమ్మవారికి మూల మంత్ర జపములు, సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11 గంటలకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు మరియు వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# మరో చరిత్ర సృష్టించిన శతాధిక చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ

**- ఒకే రోజు 7 సినిమాల ట్రైలర్స్ విడుదల- త్వరలో మిగతా 8 చిత్రాల ట్రైలర్స్**





హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 09 : 20 ఏళ్ల వ్యవధిలో 114 పైగా చిత్రాలు నిర్మించి చరిత్ర సృష్టించిన ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ గతేడాది ఆగస్టు 15న ఒకేసారి 15 చిత్రాలు ప్రారంభించి, ప్రపంచ రికార్డ్ నెలకొల్పడం తెలిసిందే. ఇప్పుడు ఆ 15 చిత్రాల్లో 7 చిత్రాల షూటింగ్స్ పూర్తి చేసి, ఆ చిత్రాల ట్రైలర్స్ అన్నీ ఒకే రోజు ఒకే వేదికపై ఆవిష్కరించి తన సత్తాను మరోసారి ఘనంగా చాటుకున్నారు. భీమవరం టాకీస్ పతాకంపై నిర్మాణమవుతూ ట్రైలర్స్ విడుదల జరుపుకున్న ఆ ఏడు చిత్రాలుఉదయ్ భాస్కర్ దర్శకత్వంలో "మహానాగ", రవి బాసర దర్శకత్వంలో "యండమూరి కథలు", విజయ్ ఎర్రంశెట్టి దర్శకత్వంలో "మా నాన్న హీరో", నూతన్ దర్శకత్వంలో "రోబో-47", "మహాబలుడు", హర్ష దర్శకత్వంలో "రుద్రతాండవం", సాయి రమేష్ దర్శకత్వంలో "మనం-2036" చిత్రాల ట్రైలర్స్ విడుదల వేడుక అత్యంత ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో అత్యంత కోలాహలంగా జరిగిన ఈ వేడుకలో సినీ నటులు సుమన్, సాయికుమార్, రాజ్య సభ సభ్యుడు, రచయిత వి.విజయేంద్రప్రసాద్, నిర్మాత కె.ఎస్.రామారావు, దర్శకుడు రేలంగి నరసింహారావు, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సినీ రచయిత జె.కె.భారవి, దర్శకులు వీరశంకర్, చంద్రమహేష్, నిర్మాతలు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, టి.ప్రసన్నకుమార్, కె.అశోక్ కుమార్, నటీమణి కవిత, కల్వ సుజాత గుప్త, వి.విజయ్ కుమార్ వంటి అతిరథమహారథులు అతిథులుగా పాల్గొని ఆయా చిత్ర బృందాలకు శుభాకాంక్షలు తెలిపారు. మొత్తం 15 చిత్రాలకు సంగీత సారథ్యం వహిస్తున్న సంగీత దర్శకద్వయం డా. ఎ.జె.సంధ్యవర్షిణి - డా. వి.ఆర్.ఎ.ప్రదీప్, ఈ చిత్రాలు అన్నిటికీ పబ్లిసిటీ బాధ్యతలు నిర్వహిస్తున్న పి.ఆర్.ఓ. ధీరజ అప్పాజీ, క్రియేటివ్ హెడ్ తల్లాడ సాయికృష్ణలతోపాటు 7 చిత్రాల దర్శకులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. భీమవరం టాకీస్ పతాకంపై నిర్మాణం జరుపుకుంటున్న 15 చిత్రాల నటీనటులు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో పాలుపంచుకున్నారు. పర్ఫెక్ట్ ప్లానింగ్ తో రికార్డు స్థాయిలో షూటింగ్ పూర్తి చేసి, ట్రైలర్స్ సిద్ధం చేసిన దర్శకులలో మరింత ఉత్సాహం నింపేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, త్వరలో ఒక్కో చిత్రం విడుదల తేది ప్రకటిస్తామని, మిగతా 8 చిత్రాల ట్రైలర్స్ త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఈ 15 చిత్రాలు ఇదే సంవత్సరం ఆగస్టులోపు విడుదల చేసి, ఆ విధంగానూ రికార్డ్ క్రియేట్ చేస్తామని నిర్మాత తుమ్మలపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.






# చేతి వృత్తిదారుల సమైక్య నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..

రేపల్లె

ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తి దారుల సమైక్య రాష్ట్ర సమితి ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ సాంబశివరావుఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ చేతి వృత్తి దారుల జీవన విధానాన్ని మెరుగు పరచడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగాంజనేయులు, చేతివృత్తి దారుల సమాక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ, వృత్తిదారుల సంఘాల నాయకులు కారుమూరు సుబ్బారావు, కొడాలి సాంబశివరావు, రైతు సంఘం నాయకులు నల్లూరి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువత వివేకానందుని స్పూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి ....

**- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.. రవిచంద్ర కుమార్.**

రేపల్లె

. స్థానిక శ్రీ ఏ బి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె నందు స్వామి వివేకానంద 163 వ జయంతి వారోత్సవాలలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. సి. రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ, భారతదేశంలోనే కాక ప్రపంచ దేశాలలో యువతకు ఆదర్శమైన స్వామి వివేకానంద యొక్క రచనలు, వ్యక్తిత్వాన్ని నేటి విద్యార్థులు ఆదర్శవంతంగా తీసుకొని ముందుకు నడవాలని కోరారు. స్వామి వివేకానంద




యొక్క శక్తివంతమైన సూక్తులను ప్రతీ రోజు పఠనం చేసి స్ఫూర్తి పొందాలని ఆకాంక్షంచారు. కళాశాల ప్రాంగణంలోగల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులలో స్వామి వివేకానంద స్ఫూర్తిని నింపేందుకు యువతపై స్వామి వివేకానంద ప్రభావం అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎన్ సి సి అధికారి కే బాలాగురవయ్య యొక్క పర్యవేక్షణలో ఎన్ సి సి విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు

# 23 నుండి శ్రీ భద్రావతి సమేత భావన రుషి స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం

రేపల్లె..

పట్నంలోని పద్మశాలి వారి వీధి పెద్ద పోస్ట్ ఆఫీస్ బజార్ ఓల్డ్ టౌన్ రేపల్లె నందు వేంచేసియున్న.. శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామివార్ల కళ్యాణ మహోత్సవం ఈ నెల 23వ తేదీ రాత్రి 9 గంటల 25 నిమిషములకు అంగరంగ వైభవంగా జరుగుతుందని రేపల్లె పద్మశాలియ బహూత్తమ సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు.. ఈ సందర్భంగా 24వ తేదీన స్వామివారి ఉత్సవ మూర్తుల రథోత్సవం ఊరేగింపు 25వ



తేదీన అన్నసంతర్పణ 26వ తేదీన వసంత సేవ అమ్మవారికి సారే పుష్పయాగ ఉత్సవము పాన్పు సేవ కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు పద్మశాలి కుల బాంధవులు భక్తులందరూ విరివిరిగా పాల్గొని తీర్థప్రసాద్ స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావలసిందిగా కమిటీ నిర్వాహకులు తెలిపారు..

# విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



రేపల్లె నిజాంపట్నం

విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య ఆకాంక్షంచారు.శుక్రవారం నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు విద్యా జ్యోతి (ఆల్ ఇన్ వన్) స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన ఈ విద్యా జ్యోతి పుస్తకాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శ్రీమతి కత్తెర హెనీ క్రిస్టినా ఆవిష్కరించారని తెలిపారు.విద్యా జ్యోతి పుస్తకం విడుదలతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని, ఈ పుస్తకం ముద్రణకు రూ.64 లక్షలు కేటాయించారన్నారు. జిల్లా పరిషత్, పురపాలక, ప్రభుత్వ, ఆదర్శ, సంక్షమ, కస్తూరిబా, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 32,276 మంది పదో తరగతి విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుందని వెల్లడించారు.విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే కాక క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని చెప్పారు.ఈ పుస్తకం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.శివన్నారాయణ, టీడీపీ నిజాంపట్నం టౌన్ అధ్యక్షులు ఖాదర్ బాబు, బీసీ సంక్షమ సంఘం యువజన నాయకులు నర్రా సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com